# జలంధర్ మాయ

**చంద్రప్రభ**

శృంగార వీధి

**'గొప్పశక్తిగల వశీకరణఉంగరం-ధరిస్తే మీ ప్రేయసి మీ స్వంతం'లాంటి ప్రకటనలు ఎన్నో పత్రికల్లో చిన్నప్పట్నుంచీ చూస్తూనేవున్నాడు రామం. వాటిని నమ్మాలో లేదో అతనికి తెలీదు. ఎందుకంటే వాటినిధరించి సత్ఫలితాన్ని సాధించినవాళ్లెవరూ అతనికి తారస పడలేదు. తనకీ అలాంటి ఉంగరంగురించి ఆలోచనా, అవసరం కలిగేదికాదు-ఈ ఇంట్లో అద్దెకి దిగివుండకపోతే! ఇంటివాళ్లమ్మాయి ప్రవీణ మరీ అంత అందంగా వుండక పోయివుంటే!**

ప్రవీణకూడా తనంటే ఇష్టంగానే వుండేది. ఆ రోజు తను తొందరపడివుండకపోతే-ఆ యిష్టం ప్రేమలోకి తర్జుమా అయివుండేదికూడా!

కానీ-

ఆవేళ-

తనను తాను నిగ్రహించుకోలేకపోయాడు.

తలంటు పోసుకుని ఆమె బాత్రూంలోంచి తువ్వాలు చుట్టుకుని వస్తూంటే, దాగీదాగని ఆమె అందాలు తన మతిపోగొట్టాయి. నిగ్రహించుకోలేక దగ్గరగావెళ్లి ఆమె వీపుని చుట్టేశాడు.

క్షణమాత్రం... చుట్టూచూసి చాచి లెంపకాయ కొట్టింది ప్రవీణ. తనకి బుర్ర తిరిగిపోయింది.

ఆవేళ్టినుంచి ఆమెని తలెత్తిచూళ్లేదు. ఆమెని పలకరించనూలేదు.

ఏక్షణాన రూం ఖాళీచేయమంటారో తెలీదు. ప్రవీణని శాశ్వతంగా మరిచిపోక తప్పదనుకున్నా డు. కానీ తనతరం కాలేదు.

ఈ జలంధర్ ఉంగరం ప్రకటన చూసిన తర్వాతే-వశీకరణం ఉంగరం ఒకటి పెట్టుకుని ప్ర యత్నిస్తే మంచిదని ఐడియా వచ్చింది. ఆమెని ఆకర్షించి మెప్పిస్తేతప్ప ఇంటివాళ్లు తనకు పిల్ల నివ్వరు. సొంతఇల్లూ, ఫారిన్‌లో కొడుకూ వున్నవాళ్లు వాళ్లంతటవాళ్లు తనలాంటి మధ్యతరగ తివాడికి పిలిచి పిల్లనివ్వరు కదా! అందులోనూ అంత అందమైన అమ్మాయిని!

వెంటనే వశీకరణఉంగరంకోసం ఉత్తరం రాసిపడేశాడు.

* * *

కాంప్‌నుంచి తిరిగి వచ్చేసరికి ఇంటాయన పలకరించాడు. "నువ్వు ఊళ్లో లేనప్పుడు జలంధర్ నుంచి పార్సిలొకటి వచ్చిందోయ్! డబ్బుకట్టి తీసు కోవాలన్నాడు పోస్ట్‌మాన్. అదేమిటో-నీవు కావాలని తెప్పించుకున్నావోలేదోనని అనుమానం వచ్చింది. ఒక్కొక్కప్పుడు ట్రాన్సిస్టర్లు పంపిస్తారుచూడూ-అలాంటిదేమోననీ, రిస్కెందుకనీ మావాళ్లు తిప్పి పంపేశారు" అని ఆయన చెబుతుండగానే "పరవా లేదు-పోస్టాఫీసులో కనుక్కుంటానులెండి!" అని మాట తుంచేశాడు రామం.

పోస్టాఫీసులో కనుక్కుంటే పార్సెల్ తిప్పి పంపేశామన్నారు. 'ఇదేమిట్రా ఇలా అపశకునం జరిగిం'దనుకుని బాధపడుతూంటే ఒకరోజు పోస్టు లో ఒక తాయెత్తు వచ్చింది.

"నీ కోరిక నీవు రాయకపోయినా గ్రహించా ము. ఇది ధరిస్తే మీకు కావలసిన వ్యక్తి మీకు వశమవుతారు. దీనిలో జతపరిచిన ఉత్తరాన్ని, పది మందికీ పంపి ఏదైనా ఆలయానికి వంద రూపాయ లు పంపండి" అనివుంది.

'దేవస్థానానికేగా డబ్బుపంపమన్నది, పనికాక పోయినా పుణ్యం వస్తుంది' అని సరిపెట్టుకుని దాం ట్లో రాసిన ప్రకారం అమావాస్యనాడు తాయెత్తు కట్టుకున్నాడు.

కట్టుకున్న రోజే వెళ్లి ప్రవీణని పలకరించాడు. నవ్వుతూ మాట్లాడింది.

"సినిమాకొస్తావా?" అనేశాడు. అంత తెగువ ఎలా వచ్చిందో అతనికే తెలియలేదు.

"మాతమ్ముడితోసహా వస్తాను"అంది కొంటె గా చూస్తూ. అదే భాగ్యంఅనుకున్నాడు రామం.

సినిమా హాల్లో పక్కనే కూర్చున్నా అతనికి దూరంగానే ఒదిగికూర్చుంది. అది మాత్రం ఎంత సేపు కనక, రామం తాయెత్తు కట్టుకున్న చేత్తో ఆమెను తాకేవరకే. ఆ తర్వాత ఆమె పరవశించిం ది. అతని చేతిని తాకింది. వేళ్లలో వేళ్లు కలిపి ముడివేసింది.

రామానికి తాయెత్తు ఇచ్చిన ధైర్యం బాగా పనిచేసింది. ఇంటర్వెల్‌లో అడిగేశాడు "నన్ను పెళ్లి చేసుకుంటావా?" అని.

"మీరొప్పుకోవాలిగా?" అందామె ఆరాధనగా చూస్తూ.

"నేనొప్పుకోవడమేమిటీ, మీనాన్నా, అమ్మా ఒ ప్పుకోవాలిగానీ! పైగా నాలాంటి మిడిల్‌క్లాస్ గాడి కి..." అనబోయాడు రామం.

"పైకి కనిపించేవి చూడకండిసార్! మాయింటి మీద చచ్చేటంత అప్పుంది. మా అన్నయ్య ఫారిన్‌లో వున్నాడన్న మాటేగానీ పైసాపంపడు. మా వాళ్లు మిమ్మల్ని అడుగుదురుగానీ కట్నం ఎక్కువ అడుగుతారేమోనని భయం!" అని ఉన్న విషయం చెప్పేసింది ప్రవీణ.

ఆ తర్వాత రామం టైము వేస్టుచేయలేదు. నెల తిరిగేసరికి వాళ్లకు పెళ్లయిపోయింది. నెలన్నర య్యేటప్పటికి రామానికి సంసారంలో 'భార్యఅలక' అనే అధ్యాయం అనుభవంలోకి వచ్చింది.

ఆ రాత్రి ఎందుకోగాని తాయెత్తు పనిచేయ లేదు. చీకట్లో తాయెత్తును ప్రవీణ నుదుటికి తగిలించేడుకూడా, అయినా ఆమె వశంలోకి రాలేదు. బాటరీల్లాగే దీన్నీ రీఛార్జ్ చేయాలి కాబో లుననుకున్నాడు-రామం.

మర్నాడు పూజామందిరంలో తాయెత్తుపెట్టి కళ్లుమూసుకుని ప్రార్థిస్తూంటే ప్రవీణ ఎందుకోగానీ నవ్వింది, మాటలు లేకపోయినా.

కళ్లు తెరిచి ప్రవీణకేసి సీరియస్‌గా చూశాడు రామం.

"పేకముక్కను ప్రార్థిస్తే భార్య లొంగుతుందా, ముచ్చటతీర్చాలిగాని!" అంది.

"నీ మొహం-నీకేం తెలుసు? తాయెత్తులో మంత్రించిన బీజాక్షరాలుంటాయి తెలుసా? కాక పోతే నువు నాకు దక్కేదానివా?" అన్నాడు రామం.




"అలాగేం? అయితే చూడండి" అంటూ అతను వారిస్తున్నా ఆమె తాయెత్తుని తీసుకుని ఎడాపెడా పీకేసి, లోపల్నుంచి మడిచిపెట్టిన ఓ పేకముక్కని తీసింది.

రామం వెర్రిమొహం వేశాడు. తనని వెర్రివాణ్ని చేసినట్టుతోచి కోపం తెచ్చుకున్నాడు.

ప్రవీణ రామం దగ్గరికి వచ్చి బుంగమూతి పెట్టి, "ఏం చేయమంటారు చెప్పండి! ఆరోజు పని మనిషి పెరట్లోనే వుంది. దాన్ని మీరు గమనించకుం డానే నన్ను కౌగలించుకున్నారు. అది మనల్ని చూస్తూనేవుంది. నేను ఏదో ఒకటి చేయకపోతే అది ఊరూ, వాడా యాగీచేస్తుంది. నా ప్రవర్తన మంచిది కాదని. అప్పటికే మిమ్మల్ని లెంపకాయకొట్టి కన్ను గీటానుకూడా. కానీ మీరు నావంక చూస్తేగా? అదే పోతపోయారు. ఆ తర్వాత పలకరించను కూడా లేదు. జలంధర్ పార్సిల్ వచ్చినప్పుడు మీకోరిక అర్థమయ్యింది. పత్రికల్లో నేనూ ఆ ప్రకటనల్ని చూస్తూ వుంటానుగా. అదెందుకు తెప్పించారో, మీ లక్ష్యం ఏమిటో తెలిసిపోయింది. ఈ తాయెత్తు ను నేనే పంపాను. మీలో ధైర్యం రగిలించకపోతే మీకోరికా, నాకోరికా తీరేదెలా? పైగా మీరేమో పిరికి..." అంటున్న ఆమె మాట పూర్తవకుండానే రామం ఆమెను నిలువెల్లా వాటేసుకుని -"ఇవాళ ఆఫీసుకి సెలవుపెట్టి నీపని పడతాను చూడు!" అని అన్నాడు.